
# బాలరాజు

-అనూరాధ



"ఒరేయ్, కుర్రాడా! ఇలా రా, ఇటు ఇలా రా"

"... ... ..."

"ఎంచక్కా వున్నాయి. ఎక్కడివిరా నీకీ తామర పువ్వులూ, కలువ పువ్వులూను..."

"యిటుకేసి యేల్పూర్రోడ్డెంట నిబ్బరంగా ఎల్తే యడంపక్క డౌన్లో సుబ్బరాజుగారి జాంతోట వుందాండీ, పక్కన పామాయిలు మొక్కలున్న బీడుందాండీ, దానికి యునకవూల పెద్ద సెరువుందండి. అందులోయండి..."

"నీకు మినపరొట్టి ముక్క పెడతా కానీ ఈ పువ్వులిస్తావా నాకు?"

"బేసినీలో నీళ్లోసి, పూలేసి, యీది గుమ్మం కాడన్నా, డాయరు మీదన్నా ఎట్టుకుందుకాండీ?"

"నీకు షోకు బాగానే తెలుసు కానీ అందు క్కాదు దేవుడి పూజకి, మిగిలిన పువ్వులన్నీ ఒకెత్తూ, ఇవి ఒక్కటీ ఒకెత్తూను. వుందిరం కలకల్లాడిపోతుంది వీటితో. ఏం, ఇస్తావా?"

"ఆయ్ఁ వుంచండి"

"నీ పేరేవిట్రా? ఏవన్నా చదువుకుంటున్నావా బళ్లోకెళ్లి?"

"అయిదో క్లాసండి. బాలరాజండి."

"బావుంది. ప్రతి శుక్రవారం, మంగళవారం తేగలవురా ఈ పువ్వులూ?"

"సెరువుకాడ ఎవురూ లేకుండా వుంటే తెత్తానండి. సూత్తేమటుకు సెర్లో దిగనివ్వరండి. గసిరేత్తారండి."

"సర్లే, దొరికితే మట్టుకు వదిలిపెట్టకు... ఏం?"

"ఆయ్, అలాగేనండి. మరండీ కాలేజీ కాడ దుబ్బుల్లో మొగిలి పొత్తులున్నాయండి. అయికూడా తేనాండి?"

"నిక్షేపంలా. కాపోతే పూజకి పనికిరావు. పిల్లకి పూలజడేస్తాను. బట్టల బీరువాలో పెట్టుకుంటాను. అమ్మా, భానూ! పొయి దగ్గర పలకల డిష్లో మినపరొట్టి ముక్క వుంటుంది కానీ తెచ్చీ పిల్లాడికివ్వవే"

"ఎల్తున్నానండి..."

"ఆఁ మంచిది. చూశావే భానూ, పది రూపాయలు పెట్టినా దొరకవు. రేకులన్నీ చక్కగా విచ్చుకున్నాయి. ఇప్పుడే కోసినట్టున్నాడు. నవనవలాడిపోతున్నాయి. అంతా ఆ తల్లి దయ. శుక్రవారం పూట కోరి గుమ్మంలోకి తెప్పించు కుంది..."

"నాయిన్నాయిన, నీ కోసమే చూస్తున్నారా

బాబూ! ఇంట్లో పిల్లాళ్లా అలవాటైపోయావు ఈ రెణ్ణెల్లనించీ. చుట్టాలొచ్చారు అనుకోకుండా. పరిగెత్తుకెళ్లి రెండు పాల పేకెట్లు పట్రా. ఇక్కడున్నట్టు రావాలి చిటికెలో. నేనిక్కడే గేట్లో నుంచుంటాను"

"అయ్ం పెరుగండి..."

"వొద్దులే, పాలు చాలు"

"... ... ..."

"రక్షించావురా తండ్రీ! బళ్లోకేనా వెళ్లేది? ఈ గోధుమల సంచీ పిండిమరలో ఇయ్యి. ఆడించి వుంచమను. మెత్తని పిండి. నువ్వు బళ్లోంచి వచ్చేప్పుడు తీసుకురా. ఇదిగో రెండ్రూపాయలు. ఇంకో పనుందిరా బాలరాజూ! రాత్రి వానకి డాబా మీద పోర్టికో మీద సన్‌షేడ్‌ల మీద నీళ్లు నిలబడిపోయాయి. అడ్డంపడ్డ ఆకులూ, చెత్తా తీసేసి నీళ్లు తుడిచెయ్యాలి."

"బడిడిసిపెట్టగానే వొత్తానండి. ఏకంగా టేంకీ కూడా కడిగేత్తానండి. నీళ్లట్టకండి."

"ఆటల్లో పడి మర్చిపోకుండా తప్పకుండా రావాలిరోయ్. ఎల్లుండి షష్ఠి తీర్థంలో ఖజ్జూర ప్పండూ, జీళ్లూ కొనుక్కుందుగాని డబ్బులిస్తాను."

"అయ్యొద్దండి.ఎలికాప్టరు కొనుక్కుంటానండి. జుంయ్‌మని ఎలిపోద్ది. పది రూపాయలండి."

"రేపీపాటికల్లా విరక్కొట్టి పారేస్తావు వెధవా! కడుపు నిండేనా, కాలు నిండేనా నేనేదో పాతది చూసి యిస్తాలే. వెళ్లు వెళ్లు.... స్కూలు టైమయిపోతోంది."

"అయ్యగారొత్తున్నారండి. ఆ బండి అయ్య గారిదేనండి. బుల్లెట్టు. ఎల్తున్నానండి."

"ఎవడు వీడు?

ఎచటి వాడు?

ఇటు వచ్చిన నల్లవాడు?

అలుపెరుగని పిల్లవాడు?"

"రోజూ అయ్యగారి పూజకి పళ్లెం నిండా రకరకాల పువ్వులు ఎలా వస్తున్నాయనుకున్నారు?

తులసి దళాలు, మారేడు దళాలు నాగమల్లి పువ్వులు, దేవకాంచనం పువ్వులు వీడి పుణ్యంవే. ఒక్కసారి చెప్పానంతే "రోజూ అయ్యగారి పూజకి పువ్వులు కావాలి రా" అని తెల్లారేసరికల్లా గేటుకి కవరు తగిలించి వుంచుతాడు నిండా పువ్వులతో.

"ఇంకా వున్నట్టున్నాయి వాడి విధులు?"

"ఆఁ మనం కష్టపడి కాని చేసుకోలేనివీ, ఎంత కష్టపడ్డా మనకి చేతకానివీ, ఇదీ, అదీ, అని లేదు. అన్ని పనులూ చిటికెలో చేసి పారేస్తాడు. మొన్నామధ్య రెండు రోజులు పనిమనిషి రాకపోతే రెండు పూటలా అంట్లు కూడా తోమాడు వెర్రివెధవ! చేతిలో పావలా పెట్టు, పది రూపాయలు పెట్టు– నవ్వుతూ తీసుకుంటాడు. ఇంతిమ్మని అడగడు. ఇంతే ఇచ్చారని సణగడు."

"ఆహాఁ విన్నకొద్దీ వినాలనిపిస్తోంది వాడి సుగుణాలు. ఆ మైకంలో పడిపోయేవు తస్మాత్ జాగ్రత్త!"

"ఆమాత్రం నాకు తెలీదనుకున్నారా? వాడికి ఏ పని చెప్పినా ఓ కంట కనిపెట్టే వుంటాను. నమ్మినట్టు కనపడతానంతే. నమ్మి వదలను. దరిద్రం ఎంత పనైనా చేయిస్తుంది. మనలో మన మాట, డేగ చూపు వాడిది. పసిగట్టడంలో వేటకుక్కే. ఇంట్లో ఏ మూల ఏవుందో ఇట్టే ఆనవాలు కట్టేస్తాడు. వాడికి పనికిరానిదీ, అఖ్ఖర్లేనిదీ లేదు. అన్నీ పోగేస్తాడు. తినడానికి ఏం పెట్టండి– ఇక్కడ తినడు. 'మాయమ్మ' అంటాడు, 'మా సెల్లి' అంటాడు. పొట్లం కట్టి జేబులో తోసేస్తాడు."

"అది సరే కానీ, నిన్న వెంకటేశ్వర్లు బియ్యబ్బస్తా, నూనె డబ్బా పంపించానన్నాడు. వచ్చాయా?"

"ఆఁ ఏం చేసుకుంటాం? ఈసారికేదో పోనియ్యండి. కానీ మళ్లీమాటు డబ్బే కావాలని ఖచ్చితంగా చెప్పండి."

"నిన్ననే చెప్పాను. కాళ్లావేళ్లా పడితే తప్పలేదు."

"మాణిక్యమ్మ గారింట్లో మావగారి సంవత్సరీకాలుట. రెండూ అక్కడికి తీసేస్తాను. ఆవిడ దగ్గరో చీటీ వుంది. అలా ఫిరాయించెయ్యమంటాను. సుందరం గారికి మూడు వేల చీటీ వుంది. రేపు రమ్మన్నాను మరి."

"ఇంకా, రెండు మూడు ఖాతాలున్నాయి. నీ దగ్గర వుంటే సద్దెయ్యి. రాగానే యిస్తానులే."

"మరేం లేదు. జీతంతోపాటు పైనొచ్చే నాలుగు రాళ్లు కూడా పులుసులో పడిపోతాయేమో నని నా కంగారు. అందుకే ఈ చీటీలూ తాపత్రయవూను. ఏదో ఆ తల్లి చల్లగా చూడబట్టి 'దేహీ' అనకుండా కాలక్షేపం చేస్తున్నాం. లేకపోతే ఆ జీతం రాళ్లమీదే ఆధారపడితే, వచ్చేపోయే ఇల్లు ఈ మండిపోయే ధరల్లో అయ్యే పనేనా?

అమ్మక్కయ్యా వాళ్లు లేచినట్టున్నారు. నేను కాఫీలు కలిపి పట్టుకొస్తాను. మీరెళ్లి పలకరించండి."

✦ ✦ ✦

"అమ్మగారూ, అమ్మగారండీ, అమ్మగారూ..."

"నువ్వ్రటా బాలరాజూ! ఈ వేళప్పుడు వచ్చావేం? బళ్లోకెళ్లలేదూ!"

"ఎల్లానండి. బల్లో బియ్యావిత్తున్నారండి. సంచీ సిరిగిపోయిందండి. నాయి మూడు కిలోలు, మా సెల్లియి మూడు కిలోలు. ఏదెన్నా సంచుంటే యీరాండమ్మగారూ, మల్లీ మాపిటేలకల్లా తెచ్చిచ్చేత్తాను."

"భోజనం పెడుతున్నారు కదురా మీకు మధ్యాహ్నం పూట రోజూ బళ్లోనూ, దానికి సాయం బియ్యం కూడా ఇస్తున్నారేవిటి?"

"అయిబాబో! రొండూనాండి. అన్నవెడితే బియ్యమీరంటండి. ఈ నెల కాణ్ణించే కదాండి అన్నవెదుతున్నది. ఇయి పోయిన్నెల బియ్యవండి."

"అంత దూరం మోసుకెళ్లగలవా? మీ యింటి వరకూ!"

"రెయిలు గేటుకాడే కదండి. కూంత దూరవే. కోటా బియం, పందార కిరసనాయిలు నేనే అట్టుకొత్తానండి. ఎవుళ్లేనా ఎత్తితే పది కేజీలు కూడా మోసేత్తానండి. రెండు సేతులూ యిలా ముందెట్టుకుని ఆటిమయాన కట్టిపేళ్లు కూడా మోసేత్తానండి. మా యిల్లు కట్టినపుడు ఇటికలూ, ఇసికా, సున్నం, మట్టీ అంత మోతా నేనేనండి. అపుడింకా మూడో క్లాసులోనే వున్నానండి. మొన్న మా యింటికాడ రోడ్డేసినపుడు రోడ్డువార కంకరంతా రేత్తిరి పొద్దోయే దాకా మా దొడ్లోకి నేనే మోశానండి. నేనేటండి, ఇంకా బుడ్డోళ్లు కూడా మోత్తారండి."

"సంచీ జాగర్తరోయ్! ఉండు బాబొస్తున్నాడు. ఆగమంటున్నాడు. వాడిని కాన్వెంటుకి పంపేసి నువ్వు మీ స్కూలుకెళ్లు."

"... ... ..."

"... ... ..."

"ఒరేయ్, బాలరాజూ పువ్వుల కోసం చెరువులోకి దిగుతావు కదా మునిగిపోవురా, నీకు ఈత కూడా వొచ్చా భయవెయ్యదా?"

"నాకేం బయ్యం! ఈదుకుంటా, ఈదుకుంటా ఆ కడకంటా ఎలిపోగల్ను. జలగలు, నీటిపాంలు పట్టుకున్నా యిదిలించి పారేత్తాను. అబ్బ జలగలట్టుకుంటే ఓ పట్టానొదలవు మాసెడ్డ సిరాకు..."

"మీ చెల్లెలు శ్రీదేవొస్తోందిరోయ్ బాలరాజూ. మీ తమ్ముడు అబ్బాస్‌ని కూడా తీసుకొస్తోంది."

"పొద్దున్న మాయమ్మ అన్నవొండలేదు. నిన్నా మొన్నా పొగులూ, మాపులూ సుట్టవున్నాడుగా మామయ్య. అందుకని బియ్యం సాల్లా. ఎల్లుండిగ్గానీ కోటా రాదంట. మా అబ్బాసుక్కూడా మాతోపాటు బల్లోనే అన్నవెట్టిచ్చెయ్యమంది మాయమ్మ. మాపిటికి వొండుతాదిలే. మామయ్య ఎల్తా ఎల్తా మా ముగ్గురికీ తలకో రెంద్రూపాయలూ యిచ్చాడు. మా సెల్లీ, మా అబ్బాసూ ఆళ్ల దబ్బులెట్టి కమలాకాయలు కొనీశారు, తినేశారు. నా దబ్బులు నే దాసుకున్నాను. ఇంకున్ని దబ్బులు పోగయ్యాక కారు కొనుక్కుంటాను."

"నా దగ్గర రిమోట్ కారుంది కదురా, నీక్కూడా చూపించానేం"

"ఒక్కసారి ఆడుకునిత్తాను యిమ్మంటే అరిగిపోయావుగామ్మా"

"అది పాడైపోయిందిరా, రిమోట్ పని చెయ్యడం లేదు."

"అలాగైతే ఇంకెందుకూ నీకు యేస్టు! నాకిత్తావా రిపేరు సేసుకు ఆడుకుంటాను. నీకు ఎర్రకాయితంతో పేద్ద గాలిపటం సేసిత్తాను. దారబ్బండి కూడా వుంది నా దగ్గిర. బాణం కూడా కట్టిత్తా."

"చూద్దాం లే. మా అమ్మగారితో మాత్రం చెప్పకు. సాయంత్రం స్కూలొదిలాక రారోరేయ్.

సైకిలు తొక్కుకుందాం. బై."

"బై బై... టాటా..."

✦ ✦ ✦

"అమ్మా, నీకు పాపం వొస్తుంది. ఆశ కురుపులు కూడా లేస్తాయి"

"ఏం మహాత్మా ఎందుకని? సెలవియ్యండి తెలుసుకుంటాను"

"పండక్కి బాలరాజుక్కూడా కొత్త బట్టలు కుట్టిస్తానన్నావా? ఇప్పుడేమో లేదంటున్నావు"

"నేనెప్పుడన్నానా గుర్తే లేదు"

"పప్పీ వాళ్లమ్మగారితో, చింటూ వాళ్లమ్మ గారితో అందరితో అన్నావు"

"ఏమన్నాను?"

"వాడమ్మ కడుపు చల్లగా రోజూ పూజకి పువ్వులు తెచ్చిపెడుతున్నాడు చేతిలో పని అందుకుంటున్నాడు. మా పిల్లలతోపాటే పండక్కి కొత్త బట్టలు కొంటాను అన్నావు. నిజంగా అన్నావు. నాకు గుర్తుంది."

"అలాగా! అంటే అన్నానులే. పువ్వులకి వాడేం కష్టపడుతున్నాడా? కానీ ఖర్చు పెడుతున్నాడా? అందరి దొడ్లల్లోవీ పుణుక్కురావడమేగా! అలా బలాదూరు తిరగడం వాళ్ల కలవాటే. ఏ పని చేసినా తక్షణం డబ్బులు చేతిలో పడేస్తున్నానా లేదా? తినేందుకు మీతోపాటే అన్నీ పెడుతున్నా కదా. నడిపాత బట్టలు యిస్తున్నాను. ఇంతకన్న ఎవరు చేస్తారు?"

"హమ్మయ్య! ఆ మాత్రం జ్ఞానం వుంది కదా. ఇంక ఫర్వాలేదు. నాన్నా, నువ్వెళ్లి ఆడుకో. ఇదిగో జెమ్స్."

"ఇవన్నీ నాకేనా, నాకొక్కడికేనా నాన్నా!"

"ఆఁ తీసికెళ్లు. ఏం లేదు. ఓ పండక్కి కుట్టిస్తే సరిపోతుందా, ప్రతిసారీ మనమీద ఆశపెట్టు కుంటాడు. అదే అలవాటూ, ఆనవాయితీ అయి కూచుంటుంది. పాత బట్టలు ఎన్నిచ్చినా ఆనవు. లెక్కలోకి రావు. లేబరు కదా ఆశెక్కువ. వాళ్లతో అలర్టుగా వుండాలి. ఏదో మనకి సాయం చేసినప్పుడు 'అయ్యో పాపం' అనిపించినా చెయి విడిచి ధారాళంగా పెట్టావనుకో, నెత్తెక్కి కూచుంటారు."

"నాకామాత్రం తెలీదనుకోకండి. మొన్నామధ్య ఎవరిదో దూళ్లపాక మీద కాశాయంటూ నాలుగు బూడిద గుమ్మడికాయలు తెచ్చిపడేశాడు. చచ్చు సంభావన కాయ యిరవై రూపాయలకి తక్కు వుండదు. మా యింటి వెనక చేలోవంటూ రెండు మూడుసార్లు బెండకాయలు పట్టుకొచ్చాడు. చెరుగ్గడలు, తేగలు, ములక్కాడలు... ఇలా అస్తమానూ ఏదో ఒకటి తెస్తుంటే 'పోన్లే పాపం' అని మనసు పీకి కొంత, చూసినవాళ్లు 'తేరగా తీసుకుంటోంద'నుకుంటారని కొంతా కొత్త బట్టల మాట అన్నాను కానీ, మళ్లీ ఆలోచించుకుని 'ఇది

## తెగేదీ కాదు... తెల్లారేదీ కాదు

పొద్దుకి చెయ్యడ్డం బెట్టి
ఎంత బారజూసినా
ఎదురుపడని కాంతిపుంజం
రెక్కాడితే గానీ
డొక్కాడని వేలపై
ఎన్నేళ్ళయినా ఈ కునికిపాట్లే.
ఎన్ని రాత్రిళ్ళు
ఎన్నిపగళ్ళు ఎదురుచూసినా
పండు మిరపకారంతో
ఎండిపోయిన వేళ్ళే
ఎన్ని యోజనాలు నడిచినా
నోట్లోకి దారిచూపని సాళ్ళే.
తెగితే ముడేసే అరవీతాళ్ళు-
దున్నడానికి నాగల్లేదు
దున్నేందుకు పొలం లేదు
కత్తీ ఆరే కాకులెత్తుకుపోయాయి
పాతాళాన్నుండి జల పైకే రాదు
కాలం రాత్రి చీకటిలో
దోబూచులాడుతుంది
ఈ సేద్దెం తెగేదీ కాదు
తెల్లారేదీ కాదు.

–మంచికంటి

ఒకనాటిది కాదు కదా, ఎప్పటికప్పుడు ఏదో ఒకటి ముట్టజెప్తూనే వున్నాం' అని ఊరుకున్నాను."

"మంచి పని చేశావ్. అలా తోటలమ్మటా, దొడ్లమ్మటా తిరిగి అందినమటుకూ అవీ, యివీ కాజెయ్యడం వాళ్లకలవాటే. దొరికినపుడు తెస్తాడు, లేనప్పుడు లేదు. అదేం నీకూ నాకు ఫేవరు కాదు."

"కనపడ్డవన్నీ పోగేస్తాడని చెప్పానా, చిక్కు తీసి పడేసిన జుట్టు జాగర్త పెట్టడం చూసి 'ఎందుకురా' అని అడిగాను. 'తలెంటికలకి లబ్బరు బేండ్లు, బొట్టు బిళ్లలు, బుడగలు యిత్తారండి. మా సెల్లి క్కొంటానండి' అన్నాడు వెధవకి ఎంతాలోచనో."

"ఓహో! నీ పాదం మీది పుట్టుమచ్చనై సెల్లెమ్మా... ఏం అంతేనా?"

"ఆయ్ఁ అంతేనండి"

✦ ✦ ✦

"అమ్మా... అమ్మా... నీ ఫ్రెండ్ టీచరాంటీ వస్తున్నారు"

"రావే, ఎన్నాళ్లో అయినట్టుంది నిన్ను చూసి. నేనే వద్దామంటే సెలవు రోజుల్లో కూడా నువ్వు బిజీనే. వర్కింగ్ దేస్‌లో నీకు బడి హడావిడీ. రెణ్ణెల్లవటల్లా నువ్వు వచ్చి..."

"ఏమోనే బాబూ, ఈ పనిలో పడి మాకు రోజులూ, వారాలూ కూడా గుర్తుండడం లేదు. జీతాలిచ్చిన రోజున మాత్రం 'ఆహాఁ ఫస్టు తారీకు వచ్చిందన్న మాట' అనుకుంటున్నాం. మా బతుకంతా 'జన్మభూమి' రుణం తీర్చుకోవడానికే సరిపోడం లేదు. ఇంక మా మొహానికి స్నేహితులూ, రాకపోకలూ కూడానా?"

"ఏం చెయ్యమన్నావే, ఓపికా తీరికా లేక యిళ్లల్లో అన్ని పేరంటాలూ మానేశావా, ఓ భోగిపళ్లని, ఓ పుట్టినరోజని, శుక్రవారం వుుత్తయిదుకి వళ్లూ, రెవికల గుడ్డా ఇచ్చుకోవడమని ఏ ముచ్చటా లేదు కదా. సరే, మమ్మల్ని ఎవరు పేరంటం పిలిచినా, గడపకి బొట్టెట్టి వెళ్లడమే. మేం కొంపలో వుండం, ఎవరో ఒకరు మా వాయనం మాకు అందజెయ్యడమే కానీ ఎంచక్కా పట్టుచీర కట్టుకుని పేరంటానికి వెళ్లి నలుగురితో సరదాగా గడిపే టైము వుండదు. ఉద్యోగంలో మాత్రం రకరకాల పేరంటాలూ, పిలుపులూ, ఊరేగింపులూ, ఉపన్యాసాలూ తిరగలేక ఛస్తున్నాం. ఇంకా నయం- ఏలినవారు ఆమధ్య గర్భిణీ స్త్రీలకి గాజులెట్టిస్తామన్నారు. ఎందుకో, మళ్లీ మర్చిపోయారు."

"బాగానే వుంది. సరే, అన్న సంతర్పణ ఎలా వుంది?"

"దంపినమ్మకు బొక్కిందే దక్కుడు"

"అంతేనంటావా?"

"అంతే మరి! ఉచ్చం, నీచం వదిలేస్తే అన్నిట్లోనూ అర్ధరూపాయి మిగులు"

"బాగానే వుంది"

"లేవకు, లేవకు. నాకిప్పుడు కాఫీలూ గట్రా వద్దు. కాసేపు కూచుని కబుర్లు చెప్పు. మళ్లీ అరగంటలో వెళ్లిపోవాలి. పిల్లలెలా వున్నారు? మీవారెలా వున్నారు? ఇరుగూపొరుగూ..."

"అందరం సుఖంగా వున్నాం. శాంతి సౌభ్రాతృత్వాలతో విరాజిల్లుతున్నాం. నేనేం చేయనులే. ఈ కూల్‌డ్రింక్ తీసుకో. ఇదిగో కాజూ. రెండు పలుకులు నోట్లో వేసుకో. ఈ పాకెట్ పిల్లలకి తీసికెళ్లు."

"ఏవిటేవ్... జంతికలూ, చేగోడీల్లా జీడిపప్పు ధారాళంగా వాడేస్తున్నావ్"

"ఒకానొక వర్తకుడు ఇన్‌స్పెక్టర్ గారికి జీడిపప్పూ, నెయ్యీ చదివించుకున్నాడులే. అదో ముచ్చట వాళ్లకి."

"ఎంతందంగా వుందే. అవున్లే, అన్ని కొలువులూ మా మేస్త్రీలా ఏడుస్తాయా- ఏ ముద్దూ ముచ్చటా లేకుండా."

"మీ ఉద్యోగాలకేవే భావిభారత పౌరుల్ని తీర్చిదిద్దుతున్నారు. 'జన్మభూమి'ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. జాతి యావత్తూ మీకు ఋణపడి వుంటుంది."

"ఆ ముక్క కరెక్టే. అందుకే మాకు ఈ మధ్య పిలిచి మరీ అప్పులిస్తున్నారు ఉదారంగా. నే వస్తా మరి. కొబ్బరికాయలు తీయించాను, ఇస్తాను. నీ కుడిభుజాన్ని పంపించు. మర్చిపోకు."

"రెండు రోజుల్నించీ వాడు కనపడ్డం లేదే. రాగానే పంపిస్తాను."

✦ ✦ ✦

"భానూ, బాలరాజెక్కడన్నా కనబడ్డాడుటే నీకూ, తమ్ముడికీ. మనింటికి వచ్చి చాలా రోజులైంది"

"లేదమ్మా! స్కూలుక్కూడా రావడం లేదుట. వాడి ఫ్రెండు చెప్పాడు."

"పండక్కి బట్టలు కుట్టిస్తానని ప్రామిస్ చేసి నిలబెట్టుకోలేకపోయావుగా, కోపం వచ్చి వుంటుంది వెధవకి!"

"నేనేం ప్రామిస్సులూ, ప్రమాణాలూ చెయ్య లేదు. మాట వరసకి అన్నానంతే. ఏవో ఆశలు పెడుతూనే వుంటాం మన పిల్లలక్కూడా. అవన్నీ ఎక్కడ తీర్చగలం?"

"బజారునించి ఏదెన్నా కొనుక్కు రమ్మని డబ్బులేవన్నా ఇచ్చావా వాడికి, గుర్తుచేసుకో. కైంకర్యం చేశాడేమో"

"లేదు లెండి. ఏం యివ్వలేదు"

"ఇంట్లో వస్తువులూ, డబ్బూ, దస్కం జాగర్తగా వున్నాయో లేదో చూసుకో"

" 'నక్కిలీసు, నక్కిలీసు' అంటూ వాడి కళ్లన్నీ నెక్లెస్ మీదే. ఉంగరాలు తీసి ఎక్కడ పడితే అక్కడ పడేస్తావు"

"అన్నీ భద్రంగానే వున్నాయి. నేను ఎప్పటి కప్పుడు సరిచూసుకుంటూనే వుంటాను. ఆఖరికి నిత్యం వాడుకునే గిన్నెలు, ప్లేట్లు, గ్లాసులు, గరిటెలు, చంచాలు కూడా లెక్కెట్టుకు గుర్తుంచు కుంటాను చాకలి పద్దల్లే. పనిమనిషి ఎక్కడ మాయం చేస్తుందోనని! నా కళ్లు కప్పలేరు ఎవరైనా సరే"

"ఇల్లాలంటే ఇల్లా వుండాలి. ఒకవేళ నీకన్నా భారీ చెయ్యి, ఎక్స్‌రే తీసినా ఎముక కనపడనిది ఇంకోటేవన్నా తగిలిందేమో. అటు పడిపోయుంటాడు. ఏవుంది వాళ్లకి- పెడితే పెళ్లి, లేకపోతే శ్రాద్ధం."

✦ ✦ ✦

''అమ్మా! బాలరాజొచ్చాడు బాలరాజు! సంచీలో ఏవిటో తెచ్చాడమ్మా. బాలరాజూ! ఎక్కడికెళ్లావురా? నువు లేనపుడు మేడ మెట్ల కింద కుక్కపిల్లల్ని పెట్టింది. నాలుగు. రెండు మచ్చలవి, రెండు నల్లవి."

''ఏం బాలరాజూ... ఎటు వాయువై పోయావు? నువు లేకపోయేసరికి చెయ్యి విరక్కొట్టుకున్నట్టుందనుకో"

''ఆయ్! వాబావ్వగారవూరెళ్లానండి. వంచిలండి. పసుపు రెలుపులున్నయ్యంటే వుండిపొయ్యానండి. రెండొందలొచ్చాయండి. మా సిన్నాన్న గారి దూళ్ల సావిడికి ఆకుట్టాలంటే సాయం సేద్దారని ఆగిపొయ్యానండి. 'మినువులూ, పెసలూ యిత్తాను రెండ్రోజులు సేలోకెళ్దాం వుండరా' అని మామయ్య గొడవ సేత్తే బాగోదని కదల్లేకపోయానండి. అలాగలాగ లేటైపొయ్యిం

## అక్షర దేవాలయం

అక్షరాలు గువ్వల సమూహాలై
అలవోకగా వాలిన
కాగితపు చెట్ల వనం
సాహిత్యం మువ్వల సమాహారమై
అందంగా రవళించే అద్భుత స్వరం
మానవాళికి వరం-గ్రంథాలయం
దేవాలయాల్లో వేన వేల దేవుళ్ళు
ఇక్కడ మాత్రం
లక్షల అక్షరాల దేవుళ్ళు
పదాలు కాగితాల పెదాల మీద
సరిగమలు పలుకుతాయి
వాక్యాలు రసాత్మక కావ్యాలై
అల్మైరాల్లో ఒదిగి కూచుంటాయి.
పుస్తకాలు హస్త భూషణాలు కాదిక్కడ
మస్తిష్కాల్ని పదును పెడ్తాయి.
వార్తా పత్రికలో వైపు
బాలల సాహిత్యం మరోవైపు
కథలూ కవితలూ ఇంకోవైపు
ఇదో ప్రపంచం
మేధో జగత్తుకి మణిదీపం
ఇది గ్రంధర్వలోకం
ఆస్తికులకూ నాస్తికులకూ
ఇష్టమైన ఆలయం
ఇది గ్రంథాలయం

-వి. గీతా నాగరాణి

దండి."

"ఏవిట్రా, బాలకుచేలా! ఆ సంచీలో అటుకులా?"

"కాదండయ్యగారూ, ఇంకా కొత్తొడ్లు రాలేదండి. పచ్చిపనువు కొవ్వుమ్మలండి. బొబ్బర్లూనండి. మంచి గుమ్మడికాయండి."

"అదేవిట్రా... ఒంటినిండా ఆ సెగ్గడ్డలేవిట్రా బాలరాజూ?"

"కురుపులండి. యేడికదండీ, పసుపురెలుపులి కెల్తే యేడిసేసి కురుపులేత్తాయండి. ఈపాలి అక్కడ పాడి సవుపాయం కూడా లేదండి. మజ్జిగ సుక్కన్నా, పెరుగు బిళ్లన్నా బొత్తిగా లేక మరీ యేడిసేసేసిందండి."

"బాగానే వుంది. నీకు వీలున్నప్పుడోసారి రారా... ఇల్లంతా సర్దుకుని దులుపుకోవాలి"

"ఆయ్! అలాగేనండి"

✦ ✦ ✦

"నాన్నా... నాన్నా... నా తుపాకీ కనపడ్డం లేదు. ఎంత వెతికినా దొరకలేదు నాన్నా. పాపం, అమ్మ వంద రూపాయలు కూడా లేవు. ఎక్కడా కనపళ్లేదు. బాలరాజు కొట్టేశాడని అనుమానం."

"అమ్మని రమ్మను. ఆఁ ఏవిటి కథ? ఆయుధాలూ, డబ్బూ కూడా మాయమయ్యాయిట. ఎవడా దేశద్రోహి?"

"నాకు బాగా గుర్తే. ఎడంచేత్తో ఎక్కడా పెట్టలేదు. ఎవరికీ ఇవ్వలేదు. కూరలవాడి కివ్వాలని టీపాయ్ మీద పుస్తకం కింద పెట్టాను."

"సరేలే, ఎప్పుడో ఒకప్పుడు ఇలా జరుగు తుందని నాకు మొదటినుంచీ అనుమానమే. ఇంతేనా, ఇంకేవన్నా పోయాయా?"

"ప్రస్తుతానికింతే"

"మళ్లీ కనపడ్డాడా, అడిగావా?"

"ఆఁ మామూలుగానే వస్తున్నాడు. గుండెలు తీసిన బంటు. ఎన్ని విధాల అడిగినా, 'నే తీయలేదండి, నాకు తెలవదండి' అని తప్ప యింకో మాట లేదు. 'బ్రాహ్మల సొమ్ము కాజేస్తే భ్రష్టుపట్టి పోతావ్వెధవా! కొంత వాడుకున్నా ఫర్వాలేదు. ఎంత మిగిలితే అంతే యియ్యి. ఏవనను, ఎవరితో చెప్పను' అని నయానా, భయానా చెప్పాను. బెల్లం కొట్టిన రాయి. ఉలకదు, పలకదు. వాళ్లమ్మని పిలిపించి అడుగుదామను కున్నా కానీ అలగాజనం వాళ్ల నోట్లో నోరెట్టలేం. 'చాకిరీ చేయించుకుని చివరికి దొంగతనం అంటగట్టారని విరుచుకుపడుతుంది. ఎందు కొచ్చిన రొస్టు' అని ఊరుకున్నాను."

"అదే మన మెతకదనం. మిగిలిన వాళ్లెవరన్నా అయితే మక్కెలిరగదన్ని వసూలు చేస్తారు. గడగడలాడుతూ చెప్పిన పని చేసి ఇవతలికి రావడమే కానీ ఇలా హస్తలాఘవం చూపిస్తే, కాళ్లూ కీళ్లూ విరిచేస్తారు. ఈసారి గుమ్మంలోకొస్తే కాళ్లు విరక్కొట్టు వెధవని."

"ఈ ఒక్క ముక్కతో మీ బాధ తీరిపోయింది. కానీ నాకల్లా కాదే. మనసు కుతకుతలాడిపోతోంది. ఆషాఢ భూతిగాడు! ఎంత పని చేశాడు! ఎంత పని చేశాడు!"

✦ ✦ ✦

"ఏవిటే నీ కుడి భుజం మీద నీ కొడుకేదో నీలాపనిందలు వేస్తున్నాడు?"

"రా, రా, కూచో. నీలాపనిందలు కాదే పంతులమ్మా! నిప్పులాంటి నిజం. మనసు మండిపోతోంది. కడుపు దహించుకుపోతోంది."

"శాంతించవే బాబూ, కుర్ర వెధవ ఏదో చాపల్యంకొద్దీ చేశాడు. ఎక్కడో నువ్వే పారేసుకున్నా వనుకో. ఇంక సాగదీసి బుర్ర పాడు చేసుకోకు."

"తిన్న యింటి వాసాల్లెక్కెట్టిన, దొంగతనం

## కౌను

పాల గిన్నె ముందు
పిల్లి కాపలా
పిల్లి కాదు అది
తల్లి యని తల్చి
పిల్ల పాలు అప్పగిస్తే
పిల్ల ఎండపోయె
పిల్లి బలసిపోయె.
పిల్ల ఎవరు అంటే
దేశ ప్రజలే.
పిల్లి ఎవరు అంటే
దేశ నాయకుడే.

-బూర్లె నరసింహశాస్త్రి

చేసిన వెధవని వెనకేసుకొస్తావేమిటే?"

"వెనకేసుకురావడం లేదే వెర్రిదానా! తెల్లారి లేస్తే వందమంది పిల్లల మధ్య మెసిలేదాన్ని. పిల్లల స్వభావం ఆకళింపు చేసుకున్నదాన్ని కాబట్టి చెప్తున్నాను. ఇది అంత తీవ్రమైన నేరంగా పరిగణించక్కర్లేదు. డబ్బు ఎదురుగా కనపడింది. ఎవరూ లేరు. దాని ఉపయోగం ఊరించింది. తీశాడు. తుపాకీతో ఆడుకోవాలని మనసు. తీరడం లేదు. చేతికి చిక్కింది. దాచేసి దక్కించుకున్నాడు. అంతే! వాడింట్లో అయినా వాడి అన్నో తమ్ముడి దగ్గరో అయినా వాడు యిదే పని చేస్తాడు. ఇందులో బాల్యచాపల్యం తప్ప స్వామి ద్రోహమూ, విశ్వాస ఘాతుకమూ కాదు."

"పాలు తాగే చంటి పిల్లాడా? దొంగతనం తప్పని తెలీదా?"

"ఏహా చక్కగా తెలును. చెట్టుని మామిడికాయో, జామకాయో, చింతకాయో కనపడితే పిల్లలెవరన్నా రాయి విసరకుండా వుండ గలరా. ఇదీ అంతే! నీకు పువ్వులూ, కాయలూ అలాగే తెచ్చివ్వలా? అప్పుడు దొంగన్నావా వాడిని?"

"పూజకి పువ్వులు కోసుకురావడం, ఇంట్లో పెట్టిన డబ్బులు ఎదురుగా వుంటే మాత్రం తీసుకుపోవడం రెండూ ఒకటేనా? ఎవర్నైనా అడుగు. ఏది తప్పంటారో. రానురానూ నీకు మతిపోతోంది. ఇలాగే చెప్తున్నావా పిల్లలకు పాఠాలు?"

"బీదవాళ్లకి సాయం చెయ్యాలి. వాళ్ల సమస్యల్ని సానుభూతితో అర్థం చేసుకోవాలి- ఇవేగా నువ్వు పిల్లలకి చేసే హితోపదేశాలు? చూడు నా పని ఏవైందో?"

"నువ్వు చేసిన సాయవేవిటే? వాడికేవన్నా అప్పిచ్చావా? హామీ వున్నావా? మీరు తినగా మిగిలింది పెట్టావు కానీ మిగిల్చి పెట్టావా? నీకు పనికిరానివిచ్చావు కానీ కొత్తవి కొనిచ్చావా?

సహృదయంతో చేస్తే సాయమౌతుంది కానీ లాభనష్టాలు లెక్కలు కట్టుకు చేసేది సాయమెలా అవుతుందే నాకు తెలీకడుగుతానూ!"

"సరేనమ్మా, నేను వాడికి సాయం చెయ్యలేదు. చేసిన పనికి కూలి యిచ్చాను. కానుకలేం యివ్వలేదు. నాకు పనికిరానివని తీసేసినవే ఇచ్చాను. కానీ నా యింట్లో దొంగతనం చేస్తే సహించి, క్షమించి ఊరుకుందుకు నేనేం మదర్ థెరిసానా?"

"నువ్వు మదర్‌థెరిసావి కాదు, వాడు మాత్రం 'సద్గుణంబులెల్ల సంఘంబులై వచ్చి చేరిన' ప్రహ్లాదుడు కావాలి. అదీ మన ఆశ!"

"ప్రహ్లాదుడు కాకపోతే అజామిళుడో, అంగుళీమాలుడో అవుతాడు. దారిదోపిడీలు, హత్యలు చేస్తూ బతుకుతాడు. నాకేం?"

"అంత తీవ్రంగా శపించకే. మన దగ్గర పనిచేసే పిల్లాడి దగ్గర నుంచి వినయం, విశ్వాసం, నిజాయితీ, క్రమశిక్షణతో కూడిన శ్రమని కోరుకుంటున్నాం. వాడికి ప్రతిఫలం చెల్లించే టప్పుడు మాత్రం కేవలం శ్రమకే ఖరీదు కడుతున్నాం. మిగిలిన సద్గుణాలన్నీ కర్ణుడికి కవచకుండలాల్లా వాడికి సహజంగా అబ్బాలి. అప్పుడే వాడు ఉత్తమ సేవకుడౌతాడు. అదీ మనలాంటి వాళ్ల అభిప్రాయం. ఔనా?"

"అందులో తప్పేం వుంది? పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు తెలీదా? మంచి బుద్ధులు పుటకతో రావాలి గానీ కొనిపెట్టేవా?"

"వస్తున్నా, కాస్త నిదానంగా ఆలోచించు. వాడి వయసెంత? పట్టుమని పదేళ్లు లేవు. వాడికి విచక్షణ, వివేకం తెలిసే ఈడు కాదు.

వాడి బ్యాక్‌గ్రౌండ్, నిత్యం వాడు మెసిలే పరిసరాలు, వాడ్ని కన్నవాళ్లూ, వాడి తోడబుట్టిన వాళ్లూ, వాళ్ల అలవాట్లూ, ఆదాయం, అవసరాలూ, కోరికలూ ఇవన్నీ వాణ్ణి రెక్కుచ్చుకు నడిపిస్తాయి."

"ఈ దిక్కుమాలిన గోలంతా నాకెందుకే. పని చేయించుకుంటాను. పావలా డబ్బులు పారేస్తాను."

"అక్కడితో మన అవసరం తీరుతుంది. మరి మనిషిగా నీ బాధ్యత? వాడ్ని మంచి దారికి మళ్లించినప్పుడే మనం వాడి కష్టానికి పూర్తి ఖరీదు చెల్లించినట్టు. అంతవరకూ వాడు కాదు దొంగ. మనలాంటి వాళ్లమే దొంగలం. ఘరానా దొంగలం.

మనకి నచ్చినా, నచ్చకపోయినా, నమ్మినా, నమ్మకపోయినా ముమ్మాటికీ ఇదే నిజం!"

●